కొంతమంది ఏ వస్తువు కొనటానికైనా గీచిగీచి బేరాలాడుతూ, ఆ బేరం ద్వారా పదిపైసలు లభించినా ఎంతో ఆనందాన్ని పొందుతారు. సరిగ్గా ఆ కోవకు చెందిన వ్యక్తే రామలింగేశ్వర్రావు. ఆయన చేసే ఉద్యోగం కూడా కూడికలకూ, తీసివేతలకూ, రూపాయలకూ, పైసలకూ సంబంధించిందే. ఎ. జి. ఆఫీసులో సెక్షన్ ఆఫీసరుగా ఉంటూ, డిప్యుటేషన్‌మీద ఒక కార్పొరేషన్‌కు అకౌంట్స్ ఆఫీసరుగా పనిచేస్తున్నాడు. ఆ సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వస్తూ, ప్రొద్దున భార్య చెప్పిన మాటలు గుర్తుకొచ్చి, రెండు కిలోల పంచదార తీసుకోవటానికి, బస్సు దిగి నేరుగా కిరాణషాపులోకి వెళ్ళాడు. పంచదార తీసుకొని వెళ్లే సాధనం లేదు. అందుచేత ముందుగా ఒక సంచి కొన్నాడు. దాన్ని బేరంచేసి చేసి, పావులాకు తక్కువగా కొన్నాడు. అసలే గుడ్డ సంచి, అందులో నాసిరకందీ పైపెచ్చు మొండిగా బేరమాడడం. ఆ కిరాణాషాపు వ్యక్తి పావలా తగ్గించి, సంవత్సరంగా కొట్లో కాపురంచేస్తూన్న ఆ సంచిని వొదిలించుకున్నాడు. అందులో రెండు కిలోల పంచదార పోయించుకొని, నేరుగా నడిచి ఇంటికొచ్చాడు రామలింగేశ్వర్రావు ఇంటికొచ్చేసరికి రెండు కిలోల పంచదార కిలోంబావుకు వచ్చింది. ఆ సంచికి గురివిందగింజంత చిల్లి వుంది. అందులోంచి పంచదార కిందికి పోతూనే వుంది. 'ఔరా! ఆ షాపువెధవ ఎంత మోసం చేశాడు!' అన్నాడు భార్యతో కనుబొమ్మల్ని ఆశ్చర్యంతో అర్ధసెంటీమీటరు పొడిగిస్తూ.

భార్య సీతామహాలక్ష్మి నవ్వుతూ అంది. "అమ్మేవాళ్ళ దేముంది, కొనే వాళ్ళు జాగ్రత్తగా వుండాలి! మీరు ఏ వస్తువు కొన్నా బేరాలాడడంతో పొద్దు పుచ్చుతారు కానీ, నాణ్యాన్ని గురించి పీసమెత్తు పట్టించుకోరు."

రామలింగేశ్వర్రావు నోరు మూసుకుపోయింది.

ఆ తర్వాత ఆమె మరో విషయం చెప్పేసరికి ఆయన మొహం చేటంత అయి, నోరు రెండు సెంటీమీటర్ల మేరకు సాగింది.

"రావుగారు వాళ్ళబ్బాయికి మనమ్మాయిని చేసుకోవడానికి ఒప్పుకున్నారు. మధ్యాహ్నం వాళ్ళావిడ మనింటికొచ్చి చెప్పింది."

"మరి కట్నం సంగతి!" అన్నాడు రామలింగేశ్వర్రావు మొహం పైకెత్తి.

సీతామహాలక్ష్మి విజయవంతంగా చిరునవ్వు చిందించి, "కట్నం పైసా అక్కర్లేదట. వాళ్ళబ్బాయి ఆదర్శాలుగల యువకుడట. కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవడం అతని ఆదర్శమట," అంది.

"మరి లాంఛనాలు?"

"లాంఛనాల సంగతి పెళ్ళికొడుక్కీ, పెళ్ళికూతురికీ తెలుస్తాయా? మనం మనం పెద్దవాళ్ళం చూసుకోవల్సిన విషయం! అయినా వాటిని గురించి ఆందోళన పడటం దేనికండీ! మన తాహతునుబట్టి మనం లాంఛనాలు జరుపుతాం. ఎటు దిరిగీ కట్నం లేదుకాబట్టి ఉన్నంతలో ఘనంగానే పెడదాం."

'సరే' అన్నట్టు తలాడించాడు రామలింగేశ్వర్రావు.

రావుగారంటే డి.పి.ఐ. ఆఫీసులో జాయింట్ డైరెక్టరుగా చేసి రిటైర్ అయ్యాడు. బర్కత్‌పురాలో కిందా, పైనా నాలుగున్నర వేల ప్లింత్ ఏరియా వచ్చేట్టు భవనం కట్టుకొని, రెండున్నర వేల రూపాయల నెలసరి అద్దె రాబడితో పెన్షన్ డబ్బుతో కులాసాగా కాలక్షేపం చేస్తున్నాడు. పెద్దకొడుక్కి పెళ్ళయింది. బొంబాయిలో ఓ పెద్ద కంపెనీలో ఓ పెద్ద ఉద్యోగం. ఇద్దరు కూతుళ్ళకూ పెళ్ళిళ్లు చేసి, మంచి ఉద్యోగాల్లో ఉన్న అల్లుళ్ళను తెచ్చుకున్నాడు. అటు పెద్ద కొడుకు సంసారమూ, ఇటు కూతుళ్ళ సంసారాలూ మూడుపువ్వులు, ఆరు కాయలుగా ఉండడంతో రావుగారు కాలుమీద కాలు వేసుకొని పదవీవిరమణ జీవిత భోగాన్ని అనుభవిస్తున్నాడు.

రామలింగేశ్వర్రావు కూతురు రాధారాణికీ, రావుగారి చిన్నకొడుకు రామకృష్ణకూ పెళ్ళి నిశ్చయమైంది. తాంబూలాలు పుచ్చుకున్నారు. ఆ తర్వాతనే లాంఛనాల తతంగం మొదలైంది.

పెళ్ళి వైభవోపేతంగా చేయాలన్నాడు రావుగారు.

తనకూ, తన కూతుళ్ళకూ, పెద్దకోడలికీ మూడూ-నాలుగువేల రూపాయల వెలకు తగ్గకుండా బెనారస్ పట్టుచీరలు పెట్టాలంది రావుగారి భార్య.

పెళ్ళికి ముందే చేతక్ స్కూటర్, సిటిజన్ క్వార్ట్జ్ వాచీ, 'క్రౌన్' పెన్నుసెట్టూ, రెండు ఉలెన్ సూట్లూ కావాలన్నాడు పెళ్ళికొడుకు చేతక్ స్కూటర్ బ్లాక్‌లో పదిహేనువేల అయిదొందలు. సిటిజన్ క్వార్ట్జ్ వాచ్ మేలైనదీ పదమూడొందల యాభై రూపాయలు. 'క్రౌన్' పెన్నుసెట్టు పదకొండు

వందల యాభై రూపాయలు. కెరిన్ రెండుసూట్లూ స్టిచ్చింగ్ ఛార్జీలతో సహా పద్దెనిమిది వందల రూపాయలు: మొత్తం వెరసి పెళ్ళికొడుకు బిల్లు పందొమ్మిది వేల రూపాయల ఎనిమిదొందలు. అంతేకాకుండా పెళ్ళిఉంగరం తప్పనిసరి లాంఛనం, తులం బంగారానికి తగ్గకుండా ఎమరాల్డ్ స్టోన్‌తో ఉండాలన్నారు. అదీ మజూరుతో రెండువేల నాలుగొందల రూపాయలైంది

కట్నంలేని పెళ్ళి కదా అని అన్నింటికీ తలొంచుకొని ఒప్పుకోవాల్సి వచ్చింది రామలింగేశ్వర్రావుకి, సీతామహాలక్ష్మికి

పెళ్ళికొడుకు తరపున వచ్చిన యాభై అరుగురు బంధువులకు ఒకమాదిరి మంచి హోటళ్ళల్లో ఇరవై అయిదు రూములు తీసుకొని వసతి ఏర్పాట్లు పెళ్ళి కూతురువాళ్ళే చేయాల్సివచ్చింది ఆ విషయంలో రావుగారు హుకుం జారీచేశారు. పెళ్ళి జరిగిన తర్వాత వాళ్ళు రెండ్రోజులదాకా రూములు ఖాళీచేయలేదు. వాళ్ళు సిటీ అంతా తిరగడానికి ఆరు టాక్సీలు ఏర్పాటు చేయవల్సి వచ్చింది. హోట ళ్ళల్లో దిగినవాళ్ళు స్వీట్లూ, ఐస్‌క్రీములూ, టిఫిన్‌లూ, భోజనాలూ ఇష్టమొచ్చినట్టు తిన్నారు. హోటళ్ళబిల్లులూ, టాక్సీల ఛార్జీలూ తడిసి మోపెడయ్యాయి

పెళ్ళిఖర్చులు కూడా రెండింతలయ్యాయి

పెళ్ళయిన పక్షంరోజుల తర్వాత రామలింగేశ్వర్రావూ, ఆయన భార్యా ఖర్చుని లెక్కలు తేలిస్తే- మొత్తం పెళ్ళికీ, పెట్టుబడులకీ, లాంఛనాలకూ, ఇతరత్రా మర్యాదలకైన ఖర్చులూ అన్నీ కలిసి ఏడువేల మూడొందలకు తక్కు వగా లక్షరూపాయలైనాయి అందులో రకరకాల మూలాధారాల ద్వారా తెచ్చిన అప్పులు నలభై ఏడువేల రూపాయలు.

రామలింగేశ్వర్రావు గుండెలో గోరంత చీకటి కొండంత అయింది ఒక్కమాటుగా.

*కట్నంలేని పెళ్ళికి లాంఛనాలు హెచ్చు.*